ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

ఆదివారం 31, మే 2026


ఎరువులు, విత్తనాల దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్

# ఆకస్మిక తనిఖీలు



* రూ.2.56 లక్షల విలువైన విత్తనాల స్టాక్‌కు స్టాప్ సేల్
* నిబంధనలు పాటించని డీలర్లపై చర్యలు

**కాగజ్‌నగర్ రూరల్, మే 30, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండల పరిధిలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాలపై శనివారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వరుణ్ ప్రసాద్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో దుకాణాల్లో నిల్వ ఉంచిన విత్తనాలు, ఎరువుల స్టాక్‌లు, రికార్డులు, లైసెన్సులు, ధరల జాబితాలను పరిశీలించారు. తనిఖీల సందర్భంగా పలు దుకాణాల్లో పర్చేజ్ సర్టిఫికేట్లు (పిసిలు) లేకుండా నిల్వ ఉంచిన విత్తనాలు గుర్తించారు. సంబంధిత ధ్రువపత్రాలు లేకపోవడంతో రూ.2,56,785 విలువైన విత్తనాల స్టాక్‌పై స్టాప్ సేల్ ఆదేశాలు జారీ చేశారు. అలాగే కొన్ని దుకాణాల్లో స్టాక్ బోర్డులు, ధరల పట్టికలు (ప్రైస్ బోర్డులు) సక్రమంగా ప్రదర్శించకపోవడాన్ని గుర్తించి, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని డీలర్లను హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా చూడడంతో పాటు అక్రమ విక్రయాలను అరికట్టేందుకు ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

వ్యవసాయ శాఖ, విజిలెన్స్ శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ తనిఖీల ద్వారా నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ, విజిలెన్స్ ఎస్ఐలు, సంబంధిత డీలర్లు పాల్గొన్నారు. అధికారులు దుకాణాల రికార్డులను పరిశీలించి, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

# ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన కలెక్టర్

* రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు విజయవంతం చేయాలి

**నిర్మల్, మే 30, ప్రభాతవార్త:**



కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదాం కేంద్రాన్ని సాధారణ తనిఖీల్లో భాగంగా శనివారం జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా పరిశీలించారు. ఈ సందర్భంగా అన్ని రిజిస్టర్లను తనిఖీ చేసి, సీసీ కెమెరాల పనితీరును సమీక్షి ంచారు. పోలీసు సిబ్బంది నిరంతరం సీసీ కెమెరాలను పర్యవేక్షిస్తూ మెరుగైన భద్రతను నిర్వహించాలని ఆదేశించారు. గోదాంలో పటిష్ట అగ్నిమాపక వ్యవస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, అధికారులు రాజశ్రీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలపై సమీక్ష అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జూన్ 2న నిర్వహించే తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై కలెక్టర్ భవేష్ మిశ్రా సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో జరిగే వేడుకలను అత్యంత ప్రతిష్టాత్మకంగా, ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. వేదికను మిగతా 2లో..

# రాజకీయాలు సమాజం, దేశ శ్రేయస్సు కోసమే చేయాలి

* బెంగాల్ తరహాలోనే తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి రావాలి
* హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ
* నైతిక విలువలు, నీతి నిజాయితీ గలవారే రాజకీయాల్లోకి రావాలని పిలుపు
* నస్పూర్ సింగరేణి అతిథి గృహంలో బండారు దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకావిష్కరణ




**నస్పూర్, మే 30, ప్రభాతవార్త**

రాజకీయాలు సమాజం, దేశ శ్రేయస్సు కోసం మాత్రమే చేయాలని, వ్యక్తిగత అవసరాలకు, పేరు ప్రతిష్టల కోసం చేయరాదని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లా నస్పూర్ మండల కేంద్రంలోని సింగరేణి అతిథి గృహంలో శనివారం ఆయన ప్రజల కథే – నా ఆత్మకథ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ నైతిక విలువలు, నీతి నిజాయితీ, సిద్ధాంతాల కోసం కష్టపడి పనిచేసే వారు మాత్రమే రాజకీయాల్లోకి రావాలని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం రాజకీయం కమిషన్లు, డబ్బు సంపాదించుకోవడానికి ఒక వృత్తిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులు నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి కోసం పనిచేయాలని సూచించారు. బెంగాల్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ భారీ ఆధిక్యంతో అధికారంలోకి రావడం శుభపరిణామన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలోనూ ఇలాంటి ఫలితాలే రావాలని ఆకాంక్షించారు. ఇందుకు భాజపా శ్రేణులు, నాయకులు ఇప్పటి నుంచే తీవ్రంగా కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు. రాజకీయ నేపథ్యం లేని సామాన్య కుటుంబం నుంచి తాను వచ్చానని, తన తల్లి ఈశ్వరమ్మ ఎంతో కష్టపడి తనను పెంచిందని బండారు దత్తాత్రేయ గుర్తు చేసుకున్నారు. ఒక సామాన్య కార్యకర్త స్థాయి నుంచి తాను ఈ స్థాయికి ఎదగడానికి ఆర్ఎస్ఎస్, బీజేపీ కార్యకర్తలే కారణమన్నారు. ఏ స్థాయిలో ఉన్నప్పటికీ ఎవరూ తమ మూలాలను మర్చిపోవద్దని హితవు పలికారు. భారతీయ జనతా మిగతా 2లో..

# రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

* కుమురం భీం జిల్లా కలెక్టర్ కె.హరిత

**కెరమెరి, మే 30, ప్రభాతవార్త :**

రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం జిల్లాలోని కెరమెరి మండలం కొఠారి కొత్తగూడ గ్రామానికి జూన్ 1వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి, రేవంత్ రెడ్డి మంత్రులు, ఉన్నతాధికారులు విచ్చేస్తున్న సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, గృహ నిర్మాణ శాఖ పి.డి. ప్రకాష్ రావు లతో కలిసి ఏర్పాట్లతో పాటు ముఖ్యమంత్రి చేతుల మీదుగా గృహప్రవేశాలు చేయనున్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లను చక్కగా అలంకరించాలని, గ్రామస్తులతో సహ పంక్తి భోజనంతో పాటు లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమం ఉన్నందున సమావేశ వేదిక వద్ద పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయాలని తెలిపారు. హెలిప్యాడ్ నుండి గ్రామంలో వచ్చే దారిలో స్వాగత తోరణాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, నిరంతర విద్యుత్ సరఫరా, త్రాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని, పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని తెలిపారు. ముఖ్యమంత్రి, మంత్రులకు ఘనంగా స్వాగతం పలికేలా అధికారులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.









# రాజకీయాలు సమాజం, దేశ శ్రేయస్సు కోసమే చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

పార్టీలో అతి సామాన్యుడిగా ఉన్న నరేంద్ర మోడీ అంచెలంచెలుగా ఎదిగి గుజరాత్ ముఖ్యమంత్రిగా, భారతదేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారని గుర్తు చేశారు. వికసిత్ భారత్ సాధనే లక్ష్యంగా ప్రధాని మోడీ పనిచేస్తున్నారని కొనియాడారు. తెలంగాణలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ చూస్తుంటే బాధగా ఉందని బండారు దత్తాత్రేయ ఆందోళన వ్యక్తం చేశారు. రైస్ మిల్లర్లు, రాష్ట్ర ప్రభుత్వం కుమ్మక్కై రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రైతులు పడుతున్న ఇబ్బందులను తొలగించడానికి కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ శ్రేణులు క్షేత్రస్థాయిలో రైతులకు అండగా నిలవాలని సూచించారు. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు చట్టప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని ఈ సందర్భంగా యాజమాన్యాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా బీజేపీ అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, సీనియర్ నాయకులు గొనె శ్యాంసుందర్ రావు, దుర్గం అశోక్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు రామాంజనేయులు, పార్టీ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన కలెక్టర్

(మొదటిపేజీ తరువాయి)

పూలతో ఆకర్షణీయంగా అలంకరించాలని, వేడుకల ప్రాంగణంలో పారిశుధ్య పనులను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులను ఆహ్వానించాలని తెలిపారు. వేడుకలకు హాజరయ్యే అతిథుల కోసం తగిన సీటింగ్, తాగునీటి సౌకర్యం, సౌండ్ సిస్టమ్, షామియానా తదితర ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సూచించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించేలా స్టాళ్లను ఏర్పాటు చేయాలని, పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున ఉదయం నిర్ణీత సమయానికి అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరై వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, హౌసింగ్ పీడీ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాజేందర్, హార్టికల్చర్ అధికారి రమణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా మురుగు కాలువల శుభ్రత

**అసిఫాబాద్ టౌన్, మే 30, ప్రభాతవార్త :**

వచ్చే నెలలో వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో అసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలో పరిశుభ్రత పై ముందస్తు చర్యలు ముమ్మరమయ్యాయి. దీనిలో భాగంగా శనివారం మున్సిపల్ పరిధిలోని 7వ వార్డు కంచుకోట ప్రాంతంలో మురికి కాలువలను జెసిబి ద్వారా మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేయించారు. ఈ పనులను మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పట్టణంలో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా ఉండేందుకే ముందస్తు పారిశుధ్య చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వర్షాలు పడేలోపే పట్టణంలోని ప్రధాన డ్రైనేజీలను, సైడ్ కాలువలను పూర్తిగా పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు. మున్సిపల్ సిబ్బంది ఎంత శ్రమించినా ప్రజల సహకారం కూడా ఉండాలని, మురికి కాలువలలో, సైడ్ డ్రైనేజీలలో చెత్తా చెదారం, ప్లాస్టిక్ కవర్లు వేయకుండ జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు సాయి శ్రావణ్, మున్సిపల్ అధికారులు, వార్డు పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# చట్టసభల పనితీరుపై అవగాహన అవసరం

## - నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

**నిర్మల్, మే 30, ప్రభాతవార్త:**



ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా వారోత్సవాలు, స్నేహ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో నమూనా పార్లమెంట్ (మాక్ పార్లమెంట్) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా హాజరై, విద్యార్థులు నిర్వహించిన మాక్ పార్లమెంట్‌ను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థలు, చట్టసభల పనితీరుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. భవిష్యత్తులో ఉత్తమ నాయకులుగా ఎదగడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ నమూనా పార్లమెంట్‌లో విద్యార్థులు ప్రధానమంత్రి, స్పీకర్, ప్రతిపక్ష నాయకులు, కేంద్ర మంత్రుల పాత్రలను ఎంతో సమర్థవంతంగా పోషించారు. మహిళా స్నేహ కార్యక్రమంలో భాగంగా సమాజంలో మహిళల భద్రత, విద్య, సమాన హక్కుల సాధనపై సభలో బిల్లును ప్రవేశపెట్టి లోతుగా చర్చించారు. ప్రజా సమస్యలపై ప్రతిపక్షాల పాత్రల్లోని విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు, మంత్రుల పాత్రల్లోని విద్యార్థులు బాధ్యతాయుతంగా సమాధానాలు ఇచ్చారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి పరిజ్ఞానాన్ని పరిశీలించారు. నమూనా పార్లమెంట్‌లో చురుగ్గా పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి (డీఆర్‌డీఓ) విజయలక్ష్మి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పుస్తకం ఆవిష్కరించిన తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం

**భైంసా, మే 30, ప్రభాతవార్త:**



సర్వ మానవ కల్యాణం కొరకు ఉద్దేశించి భగవాన్ బుద్ధుడు బౌద్ధ దమ్మాన్ని మానవాళికి అందించారని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ధర్మాజీ చందనే తెలిపారు. ప్రపంచంలో ఏ ధర్మం కూడా చెడును ప్రబోధించదని, అన్ని ధర్మాలు సమాజ శ్రేయస్సు కోసమే ఏర్పడ్డాయని పేర్కొన్నారు. మహారాష్ట్ర నాందేడ్ జిల్లా ధర్మాబాద్ నివాసి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు టి.జి. తురే రచించిన "పౌర్ణమి చ ప్రకాశాత్ బుద్ధాచే జీవన్" పుస్తకావిష్కరణ కార్యక్రమం భైంసా పట్టణంలోని ఫులే నగర్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ధర్మాజీ చందనే పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. తథాగతుడు ప్రపంచంలోని అనంత కోటి జీవరాశికి శాంతి, సుఖం కలగడం కోసం, దుఃఖం నుండి ముక్తి పొందడం కోసం మార్గాన్ని అన్వేషించి సఫలీకృతులయ్యారని చెప్పారు. ఆ మహనీయుని జీవిత చరిత్రను ఈ పుస్తకంలో రచయిత అద్భుతంగా వివరించారని తెలిపారు. ఈ సందర్భంగా రచయిత టి.జి. తురేను సంఘం నాయకులు ఘనంగా సత్కరించి, ఆయన చేసిన కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రజ్ఞ ఎంప్లాయిస్ అసోసియేషన్ భైంసా అధ్యక్షుడు భీమ్రావు వాగ్మారే, ప్రధాన కార్యదర్శి సురేష్ పట్టెరావు, భైంసా డివిజన్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్ లాడే, బౌద్ధ ఉపాసకుడు పాండురంగ జాదవ్ పాల్గొన్నారు.

# ధాన్యం తరలింపులో జాప్యం ఉండొద్దు: బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్

## సూరారం పీపీసీ కేంద్రం తనిఖీ - అదనపు లారీల ఏర్పాటుకు ఆదేశాలు

**వేమనపల్లి, మే 30, ప్రభాతవార్త**



బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ శనివారం వేమనపల్లి మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలో కొనుగోలు చేసిన వరి నిల్వలు, వాటి తరలింపు పరిస్థితులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిగిలి ఉన్న ధాన్యాన్ని గోదాములకు తరలించేందుకు అవసరమైన లారీల సంఖ్యపై ఆరా తీసి, తరలింపులో ఎలాంటి ఆటంకాలు లేకుండా అదనపు లారీలను ఏర్పాటు చేయాలని లారీ కాంట్రాక్టర్కు సూచించారు. అనంతరం సూరారం గ్రామంలోని పీపీసీ కేంద్రాన్ని సందర్శించి ధాన్యం నాణ్యతను పరిశీలించారు. గోదాములకు ఎఫ్ఎక్యూ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న వరినే పంపించాలని, రైతులు ఎక్కువ రోజులు నిరీక్షించాల్సిన పరిస్థితి తలెత్తకుండా వరి తరలింపును వేగవంతం చేయాలని ఇన్చార్జిలను ఆదేశించారు. ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న వరినె పంపించాలని, రైతులు ఎక్కువ రోజులు నిరీక్షించాల్సిన పరిస్థితి తలెత్తకుండా వరి తరలింపును వేగవంతం చేయాలని ఇన్చార్జ్‌ను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచడం అందరి బాధ్యత: చైర్‌పర్సన్ డాక్టర్ సంధ్యా రాణి

**క్యాతన్ పల్లి, మే 30, ప్రభాతవార్త**

క్యాతనపల్లి మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచడం మన అందరి బాధ్యత అని మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ గోడిసెల సంధ్యా రాణి అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. నాలుగు అంశాలతో కూడిన ఎజెండాను రెవెన్యూ అధికారి కౌన్సిల్ సభ్యులందరికి చదివి వివరించారు. మొదటి అంశం కోతులు పట్టుటకు 5 లక్షల వ్యయంతో అంచనా, రెండో అంశం నీటి సరఫరా, వీధి దీపాల కొరకు అత్యవసర సమయంలో మరమ్మత్తులకు, సామగ్రి కొనుగోలు చేయుటకు రూ. 60,000 అంచనా వ్యయం. మూడో అంశంరోడ్డు పక్కన పిచ్చి మొక్కలు తొలగించుటకు, ఇతర పారిశుధ్య పనులు చేపట్టుటకు 2 జేసిబిలు అద్దె పద్ధతిన తీసుకొనుటకు 2లక్షల అంచనా వ్యయం, నాలుగో అంశంపట్టణంలో పారిశుధ్య పనులు చేపించుటకు 2 ట్రాక్టర్లు, 6 గురు లేబెర్స్, ఇద్దరు డ్రైవర్లు లను, 2 నెలల కొరకు అద్దె పద్ధతిన తీసుకొనుటకు 4 లక్షల అంచనా వ్యయములను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం నూతనంగా కొనుగోలు చేసిన 4 స్వచ్ఛ ఆటోలను కౌన్సిల్ సభ్యులతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ , కమిషనర్ మారుతి ప్రసాద్, వైస్ చైర్ పర్సన్ , మిట్టపల్లి సరిత, కౌన్సిల్ సభ్యులు డీ. ఈ సుమతీ, ఏ.ఈ ఆశ్రిత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అంగన్వాడి వైపు అడుగు చిన్నారి భవిష్యత్తుకు బంగారు బాట

## - మంచిర్యాల జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్

**నస్పూర్, మే 30, ప్రభాతవార్త**



అంగన్వాడి వైపుగా చిన్నారులు వేసే ప్రతి అడుగు బంగారు భవిష్యత్తుకు బాట అని జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్ అన్నారు. శనివారం మంచిర్యాల పట్టణంలోని రామ్ నగర్ సెక్టార్‌లో నిర్వహించిన అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమానికి సిడిపిఓ విష్ణు ప్రియ, సూపర్వైజర్ జ్యోతి, అంగన్వాడీ టీచర్లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. చిన్నారుల సంక్షేమంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాలలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించడంతో పాటు సమయానుసారంగా పిల్లల ఎత్తు, బరువులను నమోదు చేసి వారి శారీరక, మానసిక ఎదుగుదలను పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. పోషణ్ అభియాన్ లో భాగంగా చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు. ఆరోగ్యం, పోషణ, విద్యతో పిల్లల భవిష్యత్తు ప్రగతి బాటలో నడిపేందుకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, పిల్లల తల్లితండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బాలికలు, మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ఆసిఫాబాద్, మే 30, ప్రభాతవార్త :

బాలికలు, మహిళలు హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో మహిళ వారోత్స వాలలో భాగంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్ పార్లమెంట్ కార్యక్రమానికి జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా సంక్షేమ అధికారి స్వరూపారాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, జిల్లా మహిళా సమాఖ్య ప్రతినిధి ప్రమీల లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలు, బాలికల హక్కులపై అనేక చట్టాలు తీసుకువచ్చాయని, సమాజంలో మహిళలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకునేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. మహిళలు, బాలికలు చట్టాలను గౌరవించాలని, బాల్య వివాహాలపై సమాచారం అందితే వెంటనే అధికారులకు తెలియజేయాలని, విద్యార్థులు తాము చదువుకునే పాఠశాలలను దేవాలయాలుగా భావించాలని తెలిపారు. ఈ సందర్భంగా పుల్లాస్ కార్యక్రమంలో భాగంగా సిర్పూర్ యు మండల కేంద్రానికి చెందిన 74 ఏళ్ల వృద్ధురాలు మెస్రం జిజాబాయి ఉల్లాస పరీక్ష వ్రాసి ఉత్తీర్ణులైన సందర్భంగా కలెక్టర్ శాలువాతో సన్మానించి అభినందించారు. మాక్ పార్లమెంట్ ద్వారా హక్కులు, చట్టాలపై వివరించారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులు, మహిళలు, బాలికలు పాల్గొన్నారు.



## మైనింగ్ విభాగంలో సత్తా చాటిన తాండూర్ విద్యార్థి

తాండూర్, మే 30, ప్రభాతవార్త :



మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ ఖాజిముద్దీన్ శుక్రవారం విడుదలైన టీజీ ఈసెట్ 2026 ఫలితాలలో సత్తా చాటారు. బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మైనింగ్ లో డిప్లొమా చేశారు. టీజీ ఈసెట్ ప్రిపేర్ అయ్యి పరీక్ష రాసి మైనింగ్ విభాగంలో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించారు. మైనింగ్ విభాగంలో రెండో ర్యాంకు సాధించిన ఖాజిముద్దీన్‌ను పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, ముస్లిం మైనార్టీలు అభినందించారు.



ఆలయ కమిటీ సభ్యులకు స్టీల్ ప్లేట్లు అందజేస్తున్న దాతలు

## ఆలయానికి 100 భోజనం ప్లేట్లు వితరణ

తాండూర్, మే 30, ప్రభాతవార్త :

తాండూర్ మండలం తంగళ్ళపల్లి శ్రీ ప్రసన్నాంజనేయ ఆలయానికి శనివారం బీరెల్లి శ్రీనివాస్, బీరెల్లి నరేందర్ లు తమ తండ్రి బీరెల్లి రాజయ్య జ్ఞాపకార్థం 100 భోజనం చేసే స్టీల్ ప్లేట్లు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి నెల పౌర్ణమి రోజున ఆలయంలో దాతల సహకారంతో అన్న ప్రసాద వితరణ నిర్వహిస్తున్నామన్నారు. శ్రీనివాస్, నరేందర్ తమ తండ్రి జ్ఞాపకార్థం ప్లేట్లు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు ఒడ్నాల ఆనంద్, కామని శ్రీనివాస్, బియ్యాల నిచల్, గందేశ్రీ సత్యనారాయణ, కొంకుముట్టి సత్యనారాయణ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## దేగాం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం

భైంసా, మే 30, ప్రభాతవార్త:

భైంసా మండలంలోని దేగాం గ్రామంలో శనివారం వెంకటేశ్వర మల్టీ స్పెషలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గుండె వైద్య నిపుణులు (కార్డియాలజిస్ట్) డాక్టర్ పద్మనాభయ్య పాల్గొని మాట్లాడుతూ, వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటే రోగాలు దరిచేరవని పేర్కొన్నారు. అనంతరం వైద్యులు, సిబ్బంది కలిసి గ్రామస్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పేదలకు వైద్యసేవలు అందించినందుకు గ్రామస్థుల తరపున సర్పంచ్ సిరం సుష్మారెడ్డి ఆసుపత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మనాభయ్యను, ఆసుపత్రి సిబ్బందిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## మృతుని కుటుంబీకులకు పరామర్శించిన పత్తిరెడ్డి

సారంగాపూర్, మే 30, ప్రభాతవార్త:

సారంగాపూర్ మండలంలోని బోరిగాం గ్రామ మాజీ సర్పంచ్ నాగుల నారాయణరెడ్డి చిన్నాన్న, బోరిగాం మాజీ సర్పంచ్ లక్ష్మారెడ్డి ఐదు రోజుల క్రితం మరణించారు. శనివారం సారంగాపూర్ మండల మాజీ జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి బోరిగాం గ్రామానికి వెళ్లి లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ జిల్లా ట్రెజరర్ దశరథ్ రాజేశ్వర్, అడెల్లి రాజేశ్వర్ రావు, సారంగాపూర్ మార్కెట్ డైరెక్టర్ అహమ్మద్ ముక్తార్ తదితరులు పాల్గొన్నారు.



## టీయూవీ తాండూర్ మండల అధ్యక్షుడిగా నిరంజన్ రావు

తాండూర్, మే 30, ప్రభాతవార్త :



తాండూర్ మండల తెలంగాణ ఉద్యమకారుల వేదిక(టీయూవీ) అధ్యక్షుడిగా చెప్యాల నిరంజన్ రావు నియమితులయ్యారు. ఈ మేరకు టీయూవీ రాష్ట్ర చైర్మన్ సత్యనారాయణ, రాష్ట్ర వైస్ చైర్మన్ తోడేటి శంకర్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని మలి దశ తెలంగాణ ఉద్యమకారులు గుర్తించి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిజమైన ఉద్యమకారులకు అమలు చేసేంత వరకు నిరంజన్ రావు కొనసాగుతారని వారు ఉత్తర్వులలో పేర్కొన్నారు.

## మాదారంలో అమ్మమాట అంగన్వాడి బాట

తాండూర్, మే 30 ప్రభాతవార్త :

తాండూర్ మండలంలోని మాదారం అంగన్వాడీ 3 కేంద్రంలో శనివారం అమ్మ మాట అంగన్వాడి బాట అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌కుశనపల్లి లక్షుఖుఖు మ్రణ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ 5 ఏళ్ల లోపు పిల్లలను వారి తల్లిదండ్రులు అంగన్వాడి కేంద్రాలలో చేర్పించాలన్నారు. చిన్నారులకు, గర్భిణులకు, కిశోర బాలికలకు అంగన్ వాడి కేంద్రాలలో పోషకాహారం పంపిణీ చేస్తారన్నారు. మహిళ శిశు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన చిన్నారులు, గర్భిణులు, కిశోర బాలికలు అంగన్వాడి కేంద్రాలలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, వార్డు సభ్యులు కత్తెర్ల రవికుమార్, సౌమ్య, అంగన్వాడి టీచర్ మీనా, కాంగ్రెస్ నాయకులు మీస శంకర్, ఆనంద్, పుట్ట పోషం, సిపిఐ నాయకులు పోషం, తదితరులు పాల్గొన్నారు.



మాదారంలో నిర్వహిస్తున్న అమ్మ మాట అంగన్వాడి బాట




## రేచినిలో ఘనంగా మహిళా వారోత్సవాలు

తాండూర్, మే 30, ప్రభాతవార్త :

మండల అభ్యుదయ మండల సమాఖ్య పరిధిలోని రేచిని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం ఘనంగా మహిళ వారోత్స వాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళ సంఘా సభ్యులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం దివ్యంగా సభ్యులను, ఉత్తమ సీసీలను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ఏపీఎం శ్యామల, సిసిలు గణపతి, జ్యోతి, రాజేశ్వరి, లక్ష్మి సమాఖ్య సిబ్బంది సాయి క్రిష్ణ, తాను బాయి, గ్రామ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగింపు

ఆసిఫాబాద్, మే 30, ప్రభాతవార్త :

తెలంగాణ సమాచార పౌర సంబంధాల శాఖ రాష్ట్ర, జిల్లా స్థాయి జర్నలిస్టులకు జారీ చేసిన అక్రిడిటేషన్ కార్డుల గడువును జూన్ 16 వరకు పొడిగించిందని సంబంధిత శాఖ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ప్రస్తుతం అమల్లో ఉన్న రాష్ట్ర, జిల్లా జర్నలిస్టుల బస్ పాస్‌ల గడువును కూడా జూన్ 16 వరకు పొడిగించాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ లేఖ ద్వారా విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి

## బీజేపీ రైతు భరోసా యాత్ర ఒక బూటకం

**సారంగాపూర్, మే 30, ప్రభాతవార్త:**

బీజేపీ నిర్వహిస్తున్న ఖిరైతు గోస బీజేపీ భరోసాఖి యాత్ర ఒక బూటకమని కాంగ్రెస్ నాయకుడు, సారంగాపూర్ మాజీ జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి విమర్శించారు. శనివారం మండలంలోని పలు ప్రాంతాల్లో పర్యటించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మొక్కజొన్న, వరి, జొన్న తదితర అన్ని రకాల పంటలను పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తోందని తెలిపారు. బీజేపీ అధికారంలో ఉన్న పక్క రాష్ట్రాల్లో జొన్నలు కొనుగోలు చేయకపోవడంతో, అక్కడి రైతులు ఇక్కడికి వచ్చి అమ్ముకుంటున్న పరిస్థితి ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం డబుల్ ఇంజన్ సర్కార్ అని చెప్పుకుంటూ రైతులకు ఇబ్బందులు గురిచేయడం తప్ప చేసిందేమీ లేదని మండిపడ్డారు. డీజిల్, పెట్రోల్ ధరలను భారీగా పెంచి సామాన్యులపై భారం మోపారని, వాటిని తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి మూడు గంటల కరెంట్ చాలు అన్నారంటూ బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ నాయకుడు బాల్క సుమన్‌పై పత్తిరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గతంలో సింగరేణి సంస్థలను ధ్వంసం చేయమని సుమన్‌కు వారి అధిష్టానం చెప్పిందా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు రాష్ట్రంలో ఆస్తులను ధ్వంసం చేసి, అల్లర్లు సృష్టించాలని చూస్తున్నారని ఆరోపించారు. అధికారం కోల్పోయాక ఇంత దిగజారుడు రాజకీయం చేయడం సరికాదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అయిర నారాయణరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ రాజేశ్వర్, మాజీ సర్పంచ్ రాజేశ్వరరావు, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## స్వర్ణ ప్రాజెక్టును సందర్శించిన కాంగ్రెస్ నాయకులు

**సారంగాపూర్, మే 30, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండలంలోని స్వర్ణ ప్రాజెక్టును మాజీ జడ్పీటీసీ ఫోరం అధ్యక్షుడు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఐర నారాయణరెడ్డి పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మధ్య కెనాల్ తూము గుండా నీరు లీకేజీ అవ్వడంతో ప్రాజెక్టు నీరు వృథాగా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయేది వర్షాకాలమైనప్పటికీ, వర్షాలు ఎప్పుడు పడతాయో తెలియని పరిస్థితి ఉందని, అందువల్ల ఉన్న నీటిని పొదుపుగా కాపాడుకుంటేనే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రాజెక్టులో నీటి నిల్వలు ఉంటేనే చుట్టుపక్కల బోరుబావుల్లో భూగర్భ జలాలు ఉంటాయని, లేకుంటే అవి ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. నీటి లీకేజీ విషయమై ప్రాజెక్టు అధికారులతో మాట్లాడగా, తూము మరమ్మతుకు గురైందని వారు తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. అధికారులు నిరక్ష్యంగా వ్యవహరిస్తే నీరంతా వృథా అయి రాబోయే రోజుల్లో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడతారని, కాబట్టి తక్షణమే తూముకు మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ రాజేశ్వర్, మాజీ సర్పంచ్ రాజేశ్వరరావు, ఓలత్ర నారాయణరెడ్డి, పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



స్వర్ణ ప్రాజెక్టు నీరు వృథా అవుతున్న తీరును పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, ఐర నారాయణరెడ్డి

# ఎస్‌బిఐ బ్యాంకు 2 ముందు గోల్డ్ లోన్ బాధితుల నిరాహార దీక్ష

- బ్యాంకు ఉద్యోగులు మరో కుంభకోణానికి పాల్పడుతున్నారని విమర్శ
- రికవరీ చేసిన బంగారంలో 80 శాతం మాత్రమే ఇస్తామని నోటీసులివ్వడంపై కన్నెర్ర
- దొంగతనం మీరు చేసి శిక్ష మాకు వేయడమెంటని బాధితుల మండిపాటు

**చెన్నూరు, మే 30, ప్రభాతవార్త**




9 నెలలుగా చెన్నూరు ఎస్‌బిఐ బ్యాంక్ 2 ఉద్యోగులు మా బంగారం మాకు ఇవ్వకుండా మమ్మల్ని వేధిస్తున్నారని గోల్డ్ లోన్ బాధితులు బ్యాంకు ముందు టెంటు వేసి నిరాహార దీక్ష చేపట్టారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని ఎస్‌బిఐ బ్యాంకులో బ్యాంకు ఉద్యోగులు చేతివాటం ప్రదర్శించి గోల్డ్ లోన్ ఖాతాదారుల బంగారం దొంగిలించారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి నిందితులను పట్టుకుని బంగారాన్ని రికవరీ చేశారు. ఈ తతంగం జరిగి 9 నెలలు కావస్తున్నా గోల్డ్ లోన్ బాధితులకు ఇప్పటి వరకు న్యాయం జరగకపోవడంతో బాధితులు పలుమార్లు ఎస్‌బిఐ బ్యాంకుకు వెళ్లి సిబ్బందిని నిలదీసిన సందర్భాలు ఉన్నాయి. రికవరీ చేసిన బంగారం బాధిత ఖాతాదారులకు 80 శాతం మాత్రమే చెల్లిస్తామని నోటీసులు పంపడంతో బాధితులు ఆందోళన చేపట్టారు. ఈ విషయంపై బాధితులు మాట్లాడుతూ మా అవసరాల నిమిత్తం మా దగ్గర ఉన్న బంగారాన్ని బ్యాంకులో తాకట్టు పెట్టి లోన్ తీసుకున్నామని తెలిపారు. పోలీసులు నిందితులను పట్టుకుని బంగారాన్ని రికవరీ చేసినప్పటికీ మా బంగారం మాకు పూర్తిస్థాయిలో ఇవ్వకుండా 80 శాతం మాత్రమే బంగారాన్ని ఇస్తామని మాకు నోటీసులు పంపడం బ్యాంకు సిబ్బంది మరో కుట్రకు పాల్పడుతున్నట్లు భావిస్తున్నామని తెలిపారు. బేషరతుగా మేము కుదువ పెట్టిన బంగారం, నగదు మాకు పూర్తిస్థాయిలో ఇచ్చేవరకు బ్యాంకు ముందు నిరాహార దీక్ష చేస్తామని బాధితులు పేర్కొన్నారు. తప్పు మీరు చేసి శిక్ష మాకు వేయడమెంటని బాధితులు మండిపడ్డారు.



## వివోఏల సమ్మెకు పలువురి సంఘీభావం

**సారంగాపూర్, మే 30, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండల కేంద్రంలో వివోఏలు (గ్రామ సంఘ సహాయకులు) చేపట్టిన సమ్మె శనివారం నాటికి తొమ్మిదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా సమ్మె శిబిరాన్ని ఐకేపీ ఏపీఎం మాధురి, సీసీలు విగ్నేష్, సునీత, జమాల్, ఐకేపీ సిబ్బందితో పాటు జామ్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ (టీజీబీ) మేనేజర్ రాజేశ్వర్ సందర్శించి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివోఏలు గత 20 సంవత్సరాలుగా స్వయం సహాయక సంఘాల బలోపేతానికి, మహిళల ఆర్థికాభివృద్ధికి నిరంతరంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. రాత్రింబవళ్లు శ్రమిస్తున్న వివోఏలకు ప్రభుత్వం కనీస వేతనాలు చెల్లించాలని, వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.




## అవగాహన కల్పిస్తున్న ఏపీఎం గంగామణి, ఐకేపీ సిబ్బంది

- ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై అవగాహన సదస్సు

**నర్సాపూర్(జి), మే 30, ప్రభాతవార్త:**

మండలంలోని నసీరాబాద్ గ్రామంలో ఐకేపీ ఏపీఎం గంగామణి ఆధ్వర్యంలో శనివారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలను, పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా అర్హులై ఉండి, ఇప్పటివరకు ఇందిరమ్మ ఇళ్లు రాని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామస్తులందరూ సమన్వయంతో ఉంటూ గ్రామ ప్రగతికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సీసీ ముత్యం, ఐకేపీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించాలి

- శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్
- ప్రగతి స్టేడియంలో ఏర్పాట్ల పరిశీలన

**నస్పూర్, మే 30, ప్రభాతవార్త**

శ్రీరాంపూర్ పరిధిలో జూన్ 2న జరగనున్న తెలంగాణ రాష్ట్ర 12వ అవతరణ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ ఆదేశించారు. సింగరేణి యాజమాన్యం నిర్ణయం మేరకు ఈసారి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు శనివారం శ్రీరాంపూర్ లోని ప్రగతి స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించిన సందర్భంగా స్పష్టం చేశారు. కార్మికులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున తరలివచ్చే ఈ వేడుకల్లో ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ మేరకు ఇప్పటికే ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి సన్నాహక చర్యలు పూర్తి చేసినట్లు వివరించారు. వేడుకల ప్రాంగణంలో నిరంతరం చల్లని తాగునీరు అందించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. శాశ్వత మూత్రశాలలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మొబైల్ టాయిలెట్లు, అత్యవసర వైద్య సేవల కోసం అంబులెన్స్ అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా జనరేటర్ బ్యాకప్ సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్మికులను, స్థానిక ప్రజలను ఆకట్టుకునేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఉండాలని స్పష్టం చేశారు. ఉత్తమ ఉద్యోగుల సన్మానం, ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం ఎన్. సత్యనారాయణ, డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్, ఏరియా ఇంజనీర్ రమణ రావు, ఆర్.కె 7 గ్రూప్ ఏజెంట్ కూర్మ రాజేందర్, ఆర్.కె 5 గ్రూప్ ఏజెంట్ ఎన్. శ్రీధర్, సీఎంఓఏఐ బ్రాంచ్ అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, డీజీఎంలు రాజన్న, ఆనంద్ కుమార్, హరినారాయణ, మల్లయ్య, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ జక్కా రెడ్డి, ఎన్విరాన్మెంటల్ ఆఫీసర్ హనుమాన్ గౌడ్ , అధికారులు, ఉద్యోగులు ,తదితరులు పాల్గొన్నారు.



## స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్‌లో దొంగతనం

### నిందితుడు అరెస్ట్ - 8 గ్రాముల బంగారు లాకెట్ స్వాధీనం

బెల్లంపల్లి, మే 30, ప్రభాతవార్త




ఈ నెల మే 25వ తేదీ రోజున రాత్రి 12804 స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్ రైలులో గుర్తు తెలియని వ్యక్తి దొంగతనానికి పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. ఈ కేసులో దర్యాప్తు చేపట్టిన రైల్వే పోలీస్ సిబ్బంది నిందితుడిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. జి.ఆర్.పీ ఎస్.ఐలు మహేందర్, సుధాకర్, బి.ఎన్.సింగ్, రాజేంద్ర ప్రసాద్, క్రాంతి (సిఐబిపిఎఫ్) మరియు ఆర్.పి.ఎఫ్ సిబ్బంది సంయుక్తంగా నిందితుని గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని పట్టుకుని విచారించగా, అతను దుర్గం ప్రేమ్ కుమార్ (తండ్రి: దేవాజీ, నివాసం: సిర్పూర్ కాగజ్‌నగర్)గా గుర్తించారు. విచారణలో నిందితుడు ఈ నెల మే 2న రాత్రి బల్లార్షా వద్ద స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్‌లో ఎక్కి, నిద్రిస్తున్న బాధితురాలి బ్యాగ్‌ను సిర్పూర్ కాగజ్‌నగర్ సమీపంలో దొంగతనం చేసినట్లు అంగీకరించాడు. అనంతరం ట్రైన్ నెమ్మదిగా ప్రయాణిస్తున్న సమయంలో దిగిపోయి, బ్యాగ్‌లో ఉన్న బంగారు లాకెట్ మరియు రూ.1300 నగదు తీసుకుని బ్యాగ్‌ను పారవేశాడు. తదుపరి రోజున ఆ బంగారు లాకెట్‌ను మంచిర్యాలలో విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో రైల్వే పోలీసులు అతన్ని పట్టుకుని, అతని వద్ద నుండి 8 గ్రాముల బంగారు లాకెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని కాజీపేట్ రైల్వే కోర్టుకు రిమాండ్ నిమిత్తం తరలించారు. ఈ కార్యక్రమంలో కాజీపేట్ రైల్వే ఇన్‌స్పెక్టర్ వి. నరేష్, మంచిర్యాల ఎస్.ఐ మహేందర్, బెల్లంపల్లి ఎస్.ఐ సుధాకర్, రామగుండం ఆర్‌పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు. ఈ కేసు దర్యాప్తులో సహకరించిన రైల్వే కానిస్టేబుళ్లు ఎస్. కుమార్, కె. శంకర్, టి. మల్ల గౌడ్, అలాగే ఆర్‌పిఎఫ్ సిబ్బంది బి. స్వామి, చంద్రమౌళి (హెచ్‌సి), బి. రామకృష్ణ (ఏఎస్ఐ)లను ఉన్నతాధికారులు అభినందించారు.

## బైక్ ప్రమాదంలో మహిళ మృతి

లక్షెట్టిపేట, మే 30, ప్రభాతవార్త



లక్షెట్టిపేట మండలం గుల్లకోట గ్రామ స్టేజి సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన బైక్ ప్రమాదంలో లక్షెట్టిపేట ఎంపీడీవో కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న షేర్ల శైలజ అనే 38 సంవత్సరాల మహిళ ఉద్యోగి మృతి చెందినట్లు ఎస్సై గోపతి సురేష్ తెలిపారు. మృతురాలు గత పది సంవత్సరాలుగా భర్త ఇద్దరు పిల్లలతో కలిసి మేదరి వాడ మంచిర్యాలలో నివాసం ఉంటూ లక్షెట్టిపేట ఎంపీడీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తోంది. నిన్న రాత్రి లక్షెట్టిపేట ఎంపీడీవో పదవీ విరమణ కార్యక్రమానికి భర్త ఇద్దరు పిల్లలతో కలిసి బైక్ పై వచ్చి రాత్రి 10 గంటలకు ఇంటికి వెళ్తున్న క్రమంలో గుల్లకోట స్టేజ్ వద్ద వీరు వెళ్తున్న బైకు అడవి పంది పిల్ల అడ్డు రావడంతో దాన్ని ఢీ కొట్టి కింద పడిపోగా మృతురాలి తలకు రక్తం గాయమై చనిపోయింది. ఈ ప్రమాదంలో భర్త పిల్లలకు ఎలాంటి గాయాలు కాలేదు. మృతురాలి తమ్ముడు షేర్ల శివకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయడం జరుగుతుందని తెలిపారు.

## వడదెబ్బతో కూలీ మృతి

దండేపల్లి, మే 30, ప్రభాతవార్త



దండేపల్లి మండలంలో వడ దెబ్బతో ఒకరు మృతి చెందినారు.బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం జైతుగూడ గ్రామానికి చెందిన ఆత్రం రాజేష్ (50) మృతి చెందాడు మృతుడు రాజేష్ రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం కూలీ పనులకు వెళ్లాడు. పనులు చేస్తుండగా అక్కడే కళ్లు తిరిగి కిందపడిపోయాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో ఇంటికి తీసుకెళ్లారు. వడదెబ్బ తగలడంతోనే వాంతులు, విరేచనాలు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం లక్షెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, రాజేష్ అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ నిర్ధారించడంతో మృతునికి భార్య సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తహసీనుద్దీన్ తెలిపారు.

# ప్రజల యొక్క.. ప్రజల చేత.. ప్రజల కొరకు..

### * మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, మే 30, ప్రభాతవార్త

ప్రజల యొక్క ప్రజల చేత ప్రజల కొరకు ఏర్పడిన ప్రజాస్వామ్యం మన దేశంలో కొనసాగుతూ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాక్ పార్లమెంట్ నిర్వహణ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, ఇతర శాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ద్వారా రాజ్యాధికారాన్ని చేపట్టే వారిని ఎన్నుకునే శక్తివంతమైన ఓటు హక్కు ప్రజలకు కల్పించబడిందని తెలిపారు. రాజ్యాంగం దేశాల వారీగా వివిధ రకాలుగా ఉంటుందని, మన దేశంలో అమలులో ఉన్న రాజ్యాంగం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం కలిగి ఉన్నామని తెలిపారు. శాసన సభ, పార్లమెంట్, సర్పంచ్, మండల పరిషత్, జిల్లా పరిషత్, స్థానిక సంస్థల ఎన్నికల ద్వారా ప్రజాప్రతినిధులను ఎన్నుకునే స్వేచ్ఛ కలిగి ఉన్నామని, రాష్ట్ర, కేంద్ర ఎన్నికల సంఘాల ఆధ్వర్యంలో ఎన్నికలను నిర్వహించడం జరుగుతుందని, సరైన నాయకులను ఎన్నుకునే స్వేచ్ఛ, హక్కు ప్రతి ఓటరుకు ఉంటుందని తెలిపారు. ఎన్నికలలో ప్రజలకు కల్పించిన ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని తెలిపారు. ఎన్నికలలో గెలుపొందిన ప్రజా ప్రతినిధులు ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించాలని తెలిపారు. ప్రజలకు కల్పించిన హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.



మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, ప్రతి ఒక్కరు చదువుకోవాలని తెలిపారు. విద్య అనేది ఉద్యోగం కోసం మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి అంశాన్ని తెలుసుకోవాలని, జ్ఞానం సంపాదించుకోవాలని, హక్కులు, చట్టాలు తెలుసుకోవాలని, విద్యార్థిని, విద్యార్థులు ఆత్మ రక్షణ విద్య నేర్చుకోవాలని తెలిపారు. తల్లిదండ్రులు వారి పిల్లల కోసం పడుతున్న కష్టాలు తెలుసుకోవాలని, ఏకాగ్రత, పట్టుదలతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. మహిళల రక్షణ, పోషణ, స్వావలంబన, సంక్షేమం కోసం ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. దేశంలో అనేక రకాల మతాలు, కులాలు, విభిన్న సంస్కృతులు ఉన్నప్పటికీ అందరం కలిసి జీవిస్తున్నామని, మనది యువ భారత దేశమని, దేశ భవిష్యత్తు యువతదేనని అన్నారు. భౌగోళికంగా, ఆర్థికంగా మన దేశం పటిష్టంగా ఉందని, దేశ భవిష్యత్తులో విద్య అత్యంత ప్రాముఖ్యత కలిగి ఉందని తెలిపారు. అక్షరాస్యతలో మంచిర్యాల జిల్లాలో ముందంజలో ఉంచాలని, జిల్లా ప్రజల సంక్షేమం కోసం అధికార యంత్రం సమన్వయంతో కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ప్లాస్టిక్ నిషేధిత ఆదేశాలు అమలు చేయాలి: ఎంపిఓ బాపు రావు

జైపూర్,మే 30,ప్రభాతవార్త

ప్లాస్టిక్ ను నిషేధించాలని, ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను గ్రామాల్లో అమలు చేయాలని మండల మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.శనివారం మండలంలోని పౌనూర్, శివ్వారం గ్రామపంచాయతీలను సందర్శించారు. గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించి తడి పొడి చెత్త వేరు వేరుగా సేకరించాలన్నారు. రహదారులు మురుగు కాలువల్లో పరిశుభ్రంగా ఉంచాలని గ్రామంలో ఎక్కడ కూడా ప్లాస్టిక్ కవర్లు, ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా చూడాలని పంచాయతీ సూచించారు. జల సంచాయి జల భగీదరి సర్వేలో భాగంగా ఇంటింటికి తిరిగి వాటర్ హార్వెస్టింగ్ అసెట్స్ ను మొబైల్ లో క్యాప్చర్ చేస్తున్న ప్రక్రియను పరిశీలించి, వేగవంతం చేయాలని అన్నారు. త్రాగు నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంను పరిశీలించి జూన్ రెండో తేదీ నాటికి గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉండాలని అందుకు తగు ఏర్పాటు చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. అనంతరం గ్రామపంచాయతీ రికార్డులు తనిఖీ చేశారు. ఎంపీ.ఓ వెంట పౌనూర్, శివ్వారం గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు భాస్కర్, ప్రవీణ్ గ్రామ పంచాయతీ సిబ్బంది గ్రామ ప్రజలు ఉన్నారు.





## సేవలకు ఘన సత్కారం.. భావోద్వేగ వీడ్కోలు

### - ఉద్యోగుల సేవలను కొనియాడిన జీఎం ఎన్. రాధాకృష్ణ

మందమర్రి, మే 30, ప్రభాత వార్త

మందమర్రి ఏరియా సింగరేణి సంస్థలో సుదీర్ఘకాలము పాటు విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందిన ఇద్దరు ఉద్యోగులకు శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. మందమర్రిలోని ఇల్లందు క్లబ్‌లో నిర్వహించిన పదవీ విరమణ మహోత్సవం ఆత్మీయ వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ ఎస్ఎస్ఓ (సర్వే) ఎ. ప్రసాద్ రావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ స్పెషల్ గ్రేడ్ ఎం.ఎస్. అనంత లక్ష్మిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ, సంస్థ అభివృద్ధికి ఉద్యోగులు అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో వారు చూపిన నిబద్ధత, క్రమశిక్షణ, సేవాభావం ఇతర ఉద్యోగులకు ఆదర్శంగా నిలుస్తాయని కొనియాడారు. ఉద్యోగ జీవితంలో సంపాదించిన అనుభవం, గౌరవం వారి జీవితాంతం తోడుగా ఉంటాయని అన్నారు. పదవీ విరమణ అనంతరం వారి శేష జీవితం ఆనందంగా, ఆరోగ్యంగా, కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు కూడా తమ ఉద్యోగ జీవితంలోని అనుభవాలను పంచుకుంటూ, సహోద్యోగులు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణి కుటుంబంలో పనిచేసిన కాలం తమ జీవితంలో మరపురాని అధ్యాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జి.ఎం. జి.ఎల్. ప్రసాద్, డిప్యూటీ జనరల్ మేనేజర్ (పర్సనల్) సీహెచ్. అశోక్, జీఎం కార్యాలయ అధికారులు, సిబ్బంది, ఉద్యోగుల కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం సహోద్యోగులు పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ఆత్మీయంగా వీడ్కోలు పలికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# అగ్నికి ఆహుతైన జీవనాధారం..







**- ఉపాధి కోల్పోయిన గౌడ కుటుంబాలు**

**- ఆదుకోవాలని వేడుకోలు**

**బెల్లంపల్లి, మే 30, ప్రభాతవార్త**

బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామంలో శనివారం రోజున చోటుచేసుకున్న భారీ అగ్ని ప్రమాదం స్థానిక గౌడ కుటుంబాలను తీవ్ర విషాదంలోకి నెట్టింది. గ్రామ పరిసర ప్రాంతాల్లో ఉన్న ఈత చెట్లు మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమవడంతో, వాటిపై ఆధారపడి జీవించే సుమారు ఇరవై గౌడ కుటుంబాలు ఒక్కసారిగా ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డాయి. గ్రామస్థుల వివరాల ప్రకారం, గౌడ సోదరులు ప్రతిరోజూ లాగే ఉదయం ఈత కల్లు సేకరించి అమ్ముకుని, మధ్యాహ్నం అనంతరం చెట్లు గీయడానికి వెళ్లారు. అయితే అక్కడికి చేరుకునే సరికి ఈత తోటలో అప్పటికే మంటలు వ్యాపించి చెట్లు కాలిపోతున్న దృశ్యం కనిపించింది. ఒక్కసారిగా కళ్లముందే తమ జీవనాధారం అగ్నికి ఆహుతవుతుండటాన్ని చూసి వారు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. తక్షణమే ఫైర్ ఇంజిన్‌కు సమాచారం అందించి మంటలను అదుపులోకి తేవడానికి ప్రయత్నాలు ప్రారంభించినప్పటికీ, చెట్లు ఉన్న ప్రదేశానికి ఫైర్ వాహనం చేరుకోలేకపోవడం పరిస్థితిని మరింత విషమం చేసింది. స్థానికులు స్వయంగా మంటలను ఆర్పేందుకు చేసిన ప్రయత్నాలు కూడా ఫలించకపోవడంతో అగ్ని మరింత వ్యాపించింది. ఈ ఘటనలో ప్రస్తుతం గీస్తున్న సుమారు 400 ఈత చెట్లు పూర్తిగా కాలిపోగా, ఇంకా గీయాల్సి ఉన్న దాదాపు 4 వేల చెట్లు కూడా మంటల్లో బూడిదయ్యాయి. దీంతో గౌడ కుటుంబాలు తీవ్ర ఆర్థిక నష్టాన్ని చవిచూశాయి. ఈత చెట్లే వారి ప్రధాన జీవనాధారం కావడంతో ఇప్పుడు వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ అగ్ని ప్రమాదం వెనుక గుర్తు తెలియని దుండగుల హస్తం ఉండవచ్చని బాధితులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కావాలనే ఈ ఘటనకు పాల్పడినట్లుగా వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. తమ కడుపు నింపే ఈత చెట్లు కళ్లముందే కాలిపోవడంతో తమ పరిస్థితి దయనీయంగా మారిందని, ప్రస్తుతం జీవనోపాధి లేక తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నామని బాధితులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించాలని, అబ్కారీ శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ తక్షణమే సహాయక చర్యలు చేపట్టి తమను ఆదుకోవాలని గౌడ సోదరులు వేడుకుంటున్నారు. అలాగే పునరావాసం, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కూడా వారు కోరుతున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపగా, గ్రామస్థులు బాధిత కుటుంబాలకు మద్దతుగా నిలవాలని కోరుతున్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కె.హరిత

## రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలి

**ఆసిఫాబాద్, మే 30, ప్రభాతవార్త :**

జిల్లాలో జూన్ 1వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటన నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని పాలనాధికారి చాంబర్ నుండి జిల్లా అధికారులు, మండలాల తహసిల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ఇతర అధికారులతో జూమ్ మీటింగ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి పొరపాట్లు లేకుండా విజయవంతం చేసే దిశగా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. అధికారులకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించాలని, విధులలో అలసత్వం లేకుండా ఏర్పాటు చేయాలని తెలిపారు. కాగజ్ నగర్ ఎక్స్ రోడ్డు వద్ద నిర్వహించే బహిరంగ సభకు మహిళా సంఘాల సభ్యులను తరలించాలని, మహిళలను బస్సులలో తీసుకురావాలని, ప్రతి బస్సుకు ఇద్దరు సిబ్బందిని ఇన్చార్జులుగా నియమించాలని, త్రాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. సాయంత్రం 4.30 గంటలకు ప్రజలు సభ స్థలికి చేరుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బస్సులో వచ్చేటప్పుడు ఎండ తీవ్రత దృష్ట్యా రక్షణ చర్యలు తీసుకోవాలని, సభ అనంతరం తిరిగి గ్రామాలకు చేరుకునే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, పంచాయతీ అధికారి బిక్షపతి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి లక్ష్మీనారాయణ, గృహ నిర్మాణ శాఖ పిడి ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం

**- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు**

**సిర్పూర్ (టి), మే 30, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణలో శనివారం రోజున ఐపీఎల్ మాదిరిగా క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్ కు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువతకు క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని గెలుపు ఓటములు సహజమని అన్నారు. మండలానికి ఒకటి మినీ స్టేడియం మంజూరు చేయిస్తానని తెలిపారు. ఖేలో ఇండియా డైరెక్టర్ హిమబిందుతో మినీ స్టేడియం మంజూరు చేయాలని మాట్లాడినట్టు తెలిపారు. టోర్నమెంట్ లో మొదటి విజేతగా అంజి మామ సూపర్ కింగ్స్ జట్టుకు లక్ష రూపాయల బహుమతితో పాటు ట్రోఫీని అందజేశారు. రన్నర్ ఆఫ్ టీం ఎస్ ఆర్ టిహంగ్రీహంటర్ జట్టుకు 50 వేల రూపాయల బహుమతి ట్రోఫీని ఎమ్మెల్యే హరీష్ బాబు అందజేశారు . ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రహీముద్దీన్ ఒడేటి నానయ్య దుర్గం ప్రశాంత్ మహేష్ యాదవ్ సాయి బనార్కర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే హరీష్ బాబు



మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణ

## సీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలి

**అసిఫాబాద్, మే 30, ప్రభాతవార్త**

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత మొట్టమొదటిసారిగా జిల్లాకు విచ్చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఆత్రం సుగుణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం డిసిసి కార్యాలయంలో నియోజకవర్గ ఇన్చార్జ్ అజ్మీర శ్యాం నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్, మార్కెట్ కమిటీ చైర్మన్ మంగతో కలసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వెనుకబడిన కొమురం భీం జిల్లాను అభివృద్ధి చేసే లక్ష్యంతో ముఖ్యమంత్రి జిల్లాకు రానున్నట్లు తెలిపారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందని తెలిపారు. పివిజిటీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. జిల్లాలో పెండింగ్ లో ఉన్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల మంజూరు కోసం సీఎం దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని వివరించారు. సీఎం పర్యటనలో భాగంగా జూన్ 1న కేరమేరీ మండలం కొలాం కొఠారి గ్రామంలోని 28 ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించడంతోపాటు కోలం గిరిజనులతో ముఖాముఖ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం సాయంత్రం ఐదు గంటలకు కాగజ్ నగర్ ఎక్స్ రోడ్ సమీపంలో బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సీఎం బహిరంగ సభకు జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు అత్యధిక సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. కొమురం భీం జిల్లా నుంచే రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు, రెండు లక్షల ఆసరా పెన్షన్ల మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు తారీక్, భీమ్రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గాదవేణి మల్లేష్, కార్యదర్శి శంకర్, నాయకులు దీపక్ ముండే, జక్కయ్య, వాసుదేవ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## భైంసా బస్టాండ్‌లో భద్రత శూన్యం

**- యువ నాయకుడు కాంబ్లే సాహెబ్‌రావు**

**భైంసా, మే 30, ప్రభాతవార్త:**

భైంసా పట్టణంలోని ప్రధాన బస్టాండ్‌లో ప్రయాణికులకు కనీస భద్రత కరువైందని ముధోల్ నియోజకవర్గ యువ నాయకుడు కాంబ్లే సాహెబ్‌రావు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం మధ్యాహ్నం బస్టాండ్‌లో ముగ్గురు ప్రయాణికుల మొబైల్ ఫోన్లు చోరీకి గురైన ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఘటన జరిగిన సమయంలో బస్టాండ్‌లో కనీసం ఒక్క పోలీస్ అధికారి కూడా అందుబాటులో లేకపోవడం శోచనీయమన్నారు. తానే స్వయంగా పోలీసులకు ఫోన్ చేసి రప్పించగా, అక్కడ సీసీ కెమెరాలు లేవని, పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలని పోలీసులు బాధితులకు చెప్పడం బాధ్యతారాహిత్యంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కాంబ్లే సాహెబ్‌రావు మాట్లాడుతూ రోజువారీగా వేలాది మంది మహిళలు, విద్యార్థినులు, వృద్ధులు తిరిగే భైంసా బస్టాండ్‌లో కనీసం సీసీ కెమెరాలు లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని మండిపడ్డారు. ఈరోజు ఫోన్లు పోయాయని, రేపు మహిళలపై అఘాయిత్యాలు లేదా పెద్ద ఎత్తున బంగారు ఆభరణాల దొంగతనాలు జరిగితే బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. సీసీ కెమెరాలు లేకపోతే బాధితులకు న్యాయం ఎలా జరుగుతుందని నిలదీశారు. పోలీస్ శాఖ, ఆర్టీసీ అధికారులు తక్షణమే స్పందించి భైంసా బస్టాండ్ పరిసర ప్రాంతాలలో అత్యాధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రయాణికుల భద్రత నిమిత్తం అవుట్‌పోస్ట్ సిబ్బందిని నిరంతరం అందుబాటులో ఉంచాలని కోరారు.




మాట్లాడుతున్న ముధోల్ నియోజకవర్గ యువ నాయకుడు కాంబ్లే సాహెబ్‌రావు